RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## జరా భద్రం హోటళ్లలో యథేచ్ఛగా కల్తీ ఆహారం



3

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 320 | శనివారం | 25 - 05 - 2024 | పేజీలు : 4 | వెల : 5.00

# చెమటోడుస్తున్న బావ, బామర్దులు

- ఎమ్మెల్సీ ఎన్నిక తేదీ దగ్గర పడుతున్న కొద్ది పందుకున్న ప్రచారం
- ఎట్టి పరిస్థితుల్లోనూ సిట్టింగ్ స్థానాన్ని వదులుకోవద్దు : కేసీఆర్
- బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటా పోటీ..



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక తేదీ దగ్గర పడుతున్న కొద్ది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 27 వ తేదీన వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల స్థానానికి ఉప ఎన్నిక జరగనుండడంతో భారత రాష్ట్ర సమితి ప్రచార స్పీడ్ పెంచింది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాలో తిరుగుతూ ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్ రెడ్డి. బిజెపి నుండి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. 2021 వ సంవత్సరంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుండి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సిట్టింగ్ స్థానాన్ని వదులుకోవద్దని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు.బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న బిజెపి అభ్యర్థిగా గుజ్జులా ప్రేమేందర్ రెడ్డి తోపాటు 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్న బీఅర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటి ఉండనుంది. పోలింగ్ కు మరో నాలుగు రోజులు సమయం ఉండడంతో బీ అర్ ఎస్ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బీ అర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో తిష్టవేయగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అధికార కాంగ్రెస్, ఆ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పై తీవ్ర స్థాయిలో విమర్శల దాడి చేస్తున్నారు. మరో వైపు మాజీ మంత్రి హరీష్ రావు సైతం రాకేష్ రెడ్డి గెలుపుకోసం వర్ధన్నపేట, భూపాలపల్లి, డోర్నకల్, మహబూబాబాద్ నియోజ కవర్గాల్లో రేపు ప్రచారం చేయనున్నారు.

2

## చక్రం తిప్పే రాష్ట్ర అధ్యక్షులు ఎవరు?



2

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : తెలంగాణలో రాజకీయ పార్టీలు మార్పులు కూర్పుల దిశగా ముందుకు సాగుతున్నాయి. మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్,

## జగన్ పైనే.. గులాబీ ఆశలు



2

## అడగడుగునా..నిర్లక్ష్యం



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : కాళేశ్వరం బ్యారేజీల కుంగివేతలకు గల కారణాల అధ్యయనం కోసం ఎట్టకేలకు రాష్ట్రానికి కేంద్ర నిపుణుల బృందం వచ్చింది. సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సిడబ్ల్యూటిఆర్ ఎస్) టీమ్ పూణే నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చేరుకుంది. అందులో భాగంగా మొదటగా మేడిగడ్డ,అన్నారం బ్యారేజ్ లను నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి నిపుణుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మేడిగడ్డ వద్ద కుంగిన వంతెనను నిపుణుల బృందం తరువుగా చెక్ చేసింది. గత ఏడాది సెప్టెంబర్ లో కుంగిన పిల్లర్ల వద్దకు వెళ్లి అక్కడ జరిగిన పనుల తీరును పరిశీలించింది. అలాగే అంతకుముందు డ్యామ్ సేఫ్టీ విషయంలో చేసిన పరీక్షల గురించి నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకుంది.డ్యాం క్రస్ట్ గేట్లను కేంద్ర బృందం చెక్ చేసింది. వాటి క్వాలిటీ.. క్రస్ట్ గేట్ల చుట్టుపక్కల డ్యాంకు వాడిన మెటీరియల్ ప్రామాణికతను పరిశీలించింది. మేడిగడ్డ,అన్నారం బ్యాలెన్స్ సింగ్ రిజర్వాయర్ల పూర్తి కోసం గుత్తేదారులు ఎంత టైం తీసుకున్నారన్న విషయంపైన కూడా ఆరా తీసింది. మరోవైపు గత ఏడాది వర్షాకాలం సందర్భంగా రిజర్వాయర్ల వద్ద బుంగలు ఏర్పడడానికి గల కారణాలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ

2

## 6వ విడత ఎన్నికలకు అంతా సిద్ధం



2

న్యూఢిల్లీ, ప్రభాత సూర్యుడు : దేశ వ్యాప్తంగా జూన్ 1వ రకు మొత్తం ఏడు దశల్లో జరుగుతున్న లోక్ సభ ఎన్నికల్లో ఇప్పటికే 5 దశలు పూర్తైన సంగతి తెలిసిందే. ఆరో దశ ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఆరో దశ లోక్‌సభ ఎన్నికలు దేశ రాజధాని ఢిల్లీతో సహా మొత్తం 7 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో 58 నియోజకవర్గాలకు జరగనున్నాయి. బీహార్ 8 సీట్లు, హర్యానా 10 సీట్లు, జమ్మూ కాశ్మీర్ 1 సీటు, జార్ఖండ్ 4 సీట్లు, ఢిల్లీ 7 సీట్లు, ఒడిశా 6 సీట్లు, ఉత్తరప్రదేశ్ 14 సీట్లు, పశ్చిమ

## రేవంత్ ని అరెస్ట్ చేయండి

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని.. ఆయన ఫేక్‌న్యూస్ పెడ్లర్ అంటూ విమర్శలు సంధించారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డి.. తన బంధువుకు రూ.10 వేల కోట్ల కొవిడ్ డ్రగ్ కాంట్రాక్ట్ వచ్చిందని గతంలో ఆరోపించారన్నారు కేటీఆర్, అంతేకాదు గతంలో తాము అధికారంలో ఉన్న సమయంలో సచివాలయంలో నిజాం ఆభరణాల కోసం సొరంగం తవ్వినట్లు కథనాలు సృష్టించారని..

3



## భారీ ఎన్ కౌంటర్



2

# చెమటోడుస్తున్న బావ, బామర్దులు



మొదటిపేజీ తరువాయి

మరో వైపు నల్గొండ, ఖమ్మం జిల్లాలో పల్లా రాజేశ్వర్ రెడ్డి రాకేష్ రెడ్డి గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి పట్టుబట్టి మరీ రాకేష్ రెడ్డికి టిక్కెట్ ఇప్పించుకోవడంతో ఈ ఎన్నికను ఆయన సవాలుగా తీసుకున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి విద్యా సంస్థల అధినేత కావడంతో ఆయన స్టూడెంట్స్ ను టీం లుగా రంగంలోకి దింపారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి లు పోటీపడి పట్టభద్రుల ఓట్లను నమోదు చేశారు. అయితే ఈ సారి పట్టభద్రులు ఓటు హక్కు నమోదుకు ఆసక్తి చూపలేదు. దీంతో ఇద్దరు నేతలు నమోదు చేయించిన ఓట్లు గెలుపు ఓటములు కీలకం కానున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో పట్టభద్రుల స్థానాన్ని వదులుకోవద్దని రెండు పార్టీలు చూస్తున్నాయి.

# అడగడుగునా..నిర్లక్ష్యం



మొదటిపేజీ తరువాయి

అధికారులు ఏ రకమైన నివేదికలను అప్పటి ప్రభుత్వానికి అందజేశారు అనే అంశం గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని కూడా వారు రికార్డు చేశారు. ఈ నేపథ్యంలోనే రిజర్వాయర్ల వద్ద భారీ ఎత్తున ఇసుక మేటలు కూరుకపోవడంపై వారు కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఇసుక దిబ్బలు ఎక్కువైతే డ్యామ్లకు మరింత ప్రమాదం చేకూరవచ్చని నీటిపారుదల అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. అందువల్ల ఇసుక మేటలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.డ్యాములు భవిష్యత్తులో పనికొచ్చే అవకాశం ఉందా..? లేక ప్రత్యామ్నాయ మార్గాలను ఏమైనా చేసుకోవాల్సి ఉంటుందా..? అనే అంశాన్ని కూడా కేంద్ర నిపుణుల బృందం తరువుగా పరిశీలించింది. ఇందుకోసం రిజర్వాయర్ల పరిసరాల్లో భూగర్భ పరీక్షలను నిర్వహించింది. సాయిల్ కు సంబంధించిన ఈ ల్యాండ్ ఎగ్జామినేషన్ ను కూడా చేపట్టింది. తాత్కాలికంగానైనా ఈ ప్రాజెక్టులను వాడుకోవచ్చా..? లేదా..? అనే అంశంపై కేంద్ర బృందం ఇప్పటికే ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. డ్యాముల వద్ద భారీగా బొగ్గు నిక్షేపాలున్నట్లు ఉన్నట్లు సెంట్రల్ టీం తేల్చింది. అయితే ఆ బొగ్గు నిక్షేపాల వల్ల కూడా రిజర్వాయర్లకు భవిష్యత్తులో ప్రమాదాలు జరగొచ్చని అంచనా వేస్తోంది. ఇక సుందిళ్ల బ్యారేజ్ ను కూడా సందర్శించిన తర్వాత కేంద్ర బృందం తన నివేదికలను అటు సెంట్రల్ గవర్నమెంట్ కు.. ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి పంపనుంది. ఈ నివేదికలు అందిన తర్వాత మరో రెండు సంస్థల చేత డ్యాముల భద్రతపై చేయించిన పరిశీలన నివేదికలను కూడా ఎగ్జామినేషన్ చేసి ప్రభుత్వం ఓ అంచనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నివేదికలు ఎలా ఉన్నా.. తాత్కాలికంగా మాత్రం రిజర్వాయర్ల మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పూణే నుంచి వచ్చిన సెంట్రల్ టీం అనేక లోపాలను గుర్తించింది. అందువల్ల వాటిని కూడా సీరియస్ గా పరిగణలోకి తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# జగన్ పైనే.. గులాబీ ఆశలు

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : తెలంగాణలో ఉద్యమ పార్టీ బిఆర్ఎస్ తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు పెద్ద ప్రయత్నాలే చేస్తోంది. కానీ రెండు జాతీయ పార్టీల మధ్య సతమతమవుతోంది. మళ్లీ ప్రజల్లో సెంటిమెంట్ రగిలితే కానీ పార్టీ ఎగసిపడే అవకాశాలు కనిపించడం లేదు. ఏదైనా వివాదాన్ని ఉద్యమం చేయాలంటే.. దాయాది రాష్ట్రంలో అనుకూల ప్రభుత్వం ఉండాలి. ఇప్పటివరకు జగన్ కొనసాగారు. రేపు ఎవరు వస్తారో తెలియని పరిస్థితి. అందుకే జూన్ 4 న ఫలితాల కోసం ఏపీ ప్రజలకంటే.. తెలంగాణలోని బీఆర్ఎస్ నేతలే ఎక్కువగా ఆలోచిస్తున్నారు. ఏపీలో జగన్ మరోసారి గెలవాలని ఆశిస్తున్నారు. జూన్ 2 తో ఉమ్మడి రాజధాని నుంచి హైదరాబాద్ కు విముక్తి కలుగుతుంది. విభజన జరిగి 10 ఏళ్ళు అవుతున్న చాలా సమస్యలకు ఇప్పటికీ పరిష్కార మార్గం దక్కలేదు. నీటి వివాదాలు యధాతథంగా ఉన్నాయి. ఒకవేళ ఈ సమస్యలు ఎటువంటి జఠిలం కాకుండా తేలిపోతే ఉద్యమ పార్టీ బిఆర్ఎస్ కు అస్సలు పని ఉండదు. ఆ పార్టీ ఎదిగే ఛాన్స్ ఉండదు. అందుకే వివాదాలు నడవాలంటే ఏపీలో తనకు అనుకూలమైన ప్రభుత్వం రావాలని కెసిఆర్ భావిస్తున్నారు. అందుకే జగన్ గెలుస్తారని తమకు సమాచారం ఉందని చెబుతున్నారు.ప్రస్తుతం తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నారు. ఎవరు అవునన్నా కాదన్నా ఆయన చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. ఏపీలో కూటమి అధికారంలోకి వస్తే చంద్రబాబు సీఎం అవుతారు. అప్పుడువిభజన సమస్యలు సానుకూలంగా పరిష్కారం అవుతాయి. అదే జరిగితే కెసిఆర్ తన పార్టీని.. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకతతోనే నడపాల్సి ఉంటుంది. ఇప్పటికే అక్కడ ప్రధాన ప్రతిపక్ష హోదాను దక్కించుకోవాలని బిజెపి భావిస్తోంది. ఈ లోక్ సభ ఎన్నికలతో ఫుల్ క్లారిటీ వస్తుంది. బిఆర్ఎస్ అనుకున్న స్థితిలో సీట్లు సాధించే ఛాన్స్ లేదు. ఇప్పుడు కెసిఆర్ కు ఒకే ఒక ఆసరా ఏపీలో వైసీపీ గెలుపు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులపై గులాబీ దళానికి ఒక అవగాహన ఉంది. వైసిపి పై తీవ్ర వ్యతిరేకత ఉంది. టిడిపి కూటమిపై సానుకూలత కనిపిస్తోంది. ఇది గులాబీ దళంలో నైరాశ్యానికి కారణం అవుతోంది.

# 6వ విడత ఎన్నికలకు అంతా సిద్ధం




మొదటిపేజీ తరువాయి

బెంగాల్ 8 సీట్లకుగానూ.. మొత్తం 889 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. లాజిస్టికల్, కమ్యూనికేషన్ అండ్ కనెక్టివిటీకి సంబంధించి అడ్డంకుల కారణంగా గత నెలలో ఎన్నికల సంఘం జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానానికి పోలింగ్ తేదీని మే 7 నుంచి మే 25 మార్చింది. ఇక రేపు జరగనున్న ఆరో దశ ఎన్నికలకు ఇప్పటికే ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. మే 25న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 6వ దశ ఎన్నికలకు ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 14 పార్లమెంటరీ నియోజకవర్గాల నుంచి 470, హర్యానాలో 10 నియోజకవర్గాల నుంచి 370 నామినేషన్లు వచ్చాయి. ఈ దశలో ఒక్కో పార్లమెంటరీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థుల సగటు సంఖ్య 15 అని పోల్ బాడీ పేర్కొంది. ఏడు దశల ఎన్నికలు పూర్తైన తర్వాత జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇక అదే రోజు ఫలితాలను కూడా ప్రకటించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తుంది. 8 రాష్ట్రాల్లో 58 నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. ఇక ఈ ఆరో దశలో 869 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. అయితే ఈసారి అందరి దృష్టి ఢిల్లీపైనే ఉంది. హస్తినలో బీజేపీ ముమ్మర ప్రచారం నిర్వహించడం, ఆప్ అధినేత కేజ్రీవాల్ అరెస్టై బెయిల్‌పై బయటకు రావడం లాంటి అంశాలతో ఢిల్లీలో ఎవరు గెలుస్తారన్న ఆసక్తి మరింత పెరిగింది. ఇప్పటికే కేజ్రీవాల్ మీడియా సమావేశాలు నిర్వహించారు.

# చక్రం తిప్పే రాష్ట్ర అధ్యక్షులు ఎవరు?

మొదటిపేజీ తరువాయి బీఆర్ఎస్, బీజేపీలు సంస్థాగతంగా సంచలన మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పే పార్టీల రాష్ట్ర అధ్యక్షుల నియామకాలపై ఫోకస్ పెట్టాయి కాంగ్రెస్, బీజేపీ. ఇక మరో పార్టీ బీఆర్ఎస్ సైతం ఇదే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీని ఏ రకంగా ముందుకు తీసుకెళ్లాలి? ఎలాగూ రాష్ట్ర అధ్యక్షుడిగా కేసీఆర్ ఉంటారు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఆల్రెడీ ఉన్నారు. అడిషనల్ గా ఇంకేమేమి చేయాలి? ఈ దిశగా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు.తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జూన్ 4న విడుదల కాబోతున్నాయి. అప్పటివరకు రాజకీయ పార్టీల నేతలకు కొంత గ్యాప్ దొరికింది. ఈ గ్యాప్ లో.. ఆయా పార్టీల్లో ఎలాంటి సంస్థాగత మార్పులు చేయాలి? అనేదానిపై అన్ని పార్టీలు దృష్టి పెట్టాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ ని తొలగించిన ఆయన స్థానంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డిని నియమించారు.కాగా, అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల వరకు మాత్రమే కిషన్ రెడ్డి అధ్యక్షుడిగా ఉంటారని ముందుగానే జాతీయ స్థాయి నాయకత్వం క్లారిటీ ఇచ్చింది. దాంతో దాదాపుగా జూన్ నెలలోనే కిషన్ రెడ్డి అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడం ఖాయం. అదే నెలలోనే బీజేపీలో అధ్యక్ష మార్పు ఉండబోతోంది.ఇటు కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. ఆ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చారు. ఆయన కృషికి ఫలితం దక్కింది. ముఖ్యమంత్రి కూడా అయ్యారు. దీంతో కాంగ్రెస్ కూడా కచ్చితంగా పీసీసీ అధ్యక్షుడిని మార్చబోతోంది. లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ కి కొత్త అధ్యక్షుడు రానున్నారు.ఇక బీఆర్ఎస్ విషయానికి వస్తే.. రాష్ట్ర అధ్యక్షుడిగా మొదటి నుంచి కూడా కేసీఆర్ ఉన్నారు. 2019లో బీఆర్ఎస్ మరోసారి అధికారం చేపట్టింది. ఆ తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కేటీఆర్ కి కట్టబెట్టారు. అధ్యక్షుడిగా కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఇద్దరూ.. ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించారు. అయితే అనుకున్న ఫలితాలు రాలేదు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. మళ్లీ కార్యకర్తలను, పార్టీని పునరుత్తేజం చేసేందుకు క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు.అధికారంలో ఉన్న పదేళ్లు పార్టీని పట్టించుకోలేదు, సంస్థాగతంగా నిర్మించలేదనే ఒక విమర్శ ఉంది. ఎన్నికలకు ఒక ఏడాది ముందు మాత్రమే అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలను ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమించింది తప్పితే రాష్ట్ర కార్యవర్గం కానీ జిల్లా కార్యవర్గం కానీ ఎక్కడా లేదు. కాబట్టి కార్యవర్గ నిర్మాణాలతో పాటు, బీఆర్ఎస్ లో ఉన్న మరో కీలక నేత హరీశ్ రావుకి కొంత ప్రాధాన్యత ఇచ్చే దిశగా అడుగులు పడుతున్నట్లుగా తెలుస్తోంది.మొత్తంగా మూడు ప్రధాన పార్టీల్లో ఎలాంటి మార్పులు జరగబోతున్నాయి? ఆ పార్టీల్లో ఏం జరగబోతోంది? లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఎలాంటి మార్పులు ఉండనున్నాయి? ఉన్న నాయకత్వాన్ని ఎలా కూర్పు చేయబోతున్నారు? ఇలాంటి అంశాలపై స్పెషల్ అనాలసిస్.. "చక్రం తిప్పే రాష్ట్ర అధ్యక్షులు ఎవరు?"

# భారీ ఎన్ కౌంటర్



నారాయణ్ పూర్, ప్రభాత సూర్యుడు : చత్తీస్‌గఢ్‌లో మరోసా - బీజాపూర్ సరిహద్దులో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు హతమయ్యారు పలువురు గాయపడ్డారు...ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల కదలికలపై విశ్వసనీయ సమాచారం మేరకు, స్థానిక పోలీసులతో కలిసి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నారాయణపూర్ అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇప్పటివరకు ఏడుగురు మావోయిస్టులు మరణించారు. నారాయణపూర్ అడవుల్లో ఇంకా ఎదురుకాల్పులు జరుగుతున్నట్లు సమాచారం. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తోంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# పాఠశాలల పునః ప్రారంభం లోపు మౌలిక వసతులను సమకూర్చాలి

## – అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్



అబ్దుల్లాపూర్మెట్ – ప్రభాత సూర్యుడు : ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభం అయ్యేనాటికి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అన్నిరకాల వసతులను ఏర్పాటు చేయాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పసుమముల ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులలోని కరెంటు సరఫరా, మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలను పరిశీలించారు. అరకొర మౌళిక సదుపాయాలను పాఠశాల పునః ప్రారంభం నాటికి ఏర్పాటు చేయాలని మున్సిపాలిటీ డీ ఈ ఈ అశోక్ కుమార్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్ రెడ్డి, ఏఈ వీరాంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

# జరా భద్రం హోటళ్లలో యదేచ్ఛగా కల్తీ ఆహారం



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : సందర్భం ఏదైనా, వారం ఏదైనా భాగ్యనగరం హైదరాబాద్‌లో చాలా మంది రెస్టారెంట్‌కు వెళ్లాల్సిందే! ఉదయం బ్రేక్ ఫాస్ట్‌తో మొదలు మధ్యాహ్నం లంచ్, రాత్రికి డిన్నర్‌తో సహా అన్నీ హోటల్లోనే కడుపు నిండా తినేస్తారు. వినియోగదారుల అవసరాన్ని హోటళ్లు, రెస్టారెంట్లు అవకాశంగా మలుచుకుంటున్నాయి. రకరకాల ఫ్లేవర్లు కలుపుతూ కష్టమర్ల కడుపుకు ఫుడ్ బదులు పాయిజన్ పెడుతున్నారు రెస్టారెంట్, హోటల్ యజమానులు. పురుగులు పడిన చికెన్‌ను ఫ్రై చికెన్‌గా, పాచిపోయిన చికెన్‌ను తందూరి చేసి కష్టమర్లకు వడ్డిస్తున్నారు. ఒక్క చికెనే కాదు, మటన్, చేపలు, రొయ్యలు, రోటీ, ఐస్ క్రీములు ఇలా అన్నీ కల్తీ చేసి వినియోగదారులకు కడుపు నిండా పెడుతూ రోగాల బారిన పడేటట్లు చేస్తున్నారు. భాగ్యనగరంలోని పెద్ద పెద్ద హోటల్స్, రెస్టారెంట్లలో అధికారులు చేస్తున్న తనిఖీల్లో ఒళ్లు గగుర్పొడిచే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నాణ్యత లేని ఆహారం సరఫరా చేస్తూ వినియోగదారుల జేబు ఖాళీ చేయడంతో పాటు వారి ఆరోగ్యాన్ని సైతం నాశనం చేస్తున్నారు హోటల్ నిర్వాహకులు. హైదరాబాద్‌లో హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు గత కొద్ది రోజులుగా తనిఖీలు చేస్తున్నారు. ప్రతి చోటా ఫ్రిడ్జ్‌ల్లో స్టోర్ చేసినవి, గడువు ముగిసిన మాంసం, వస్తువులను వంట కోసం ఉపయోగిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. చాలా చోట్ల నాణ్యత లేని ఆహారం గుర్తించి వాటి నమూనాలను నాచారం ల్యాబ్‌కు పంపించారు. రిపోర్ట్స్ వచ్చిన వెంటనే కల్తీ, నాణ్యత లేని ఆహారం తయారు చేస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. హైదరాబాద్‌లో గొప్పగా చెప్పుకునే ఏ ఒక్క హోటల్‌లో ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారం దొరకడం లేదు. వంట చేసేందుకు వాడిన నూనెనే మళ్లీ మళ్లీ వాడుతున్నారు. ఫ్రిడ్జ్‌లో భద్రపరచాల్సిన ఆహార ఉత్పత్తులు ఎక్కడ పడితే అక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. కొన్నింటికి అవసరమైన మెడికల్ అనుమతులు కూడా లేవు. కొన్ని హోటల్స్ కిచెన్స్ మురుగు కాల్వల పక్కనే ఉన్నాయి. ఫైవ్ స్టార్ ఫుడ్ కోర్టులు, ఇక ఐస్ క్రీమ్ పార్లర్లు, బేకరీలు, ప్రమాదకర రంగులు, ఇతర కెమికల్స్ ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించి అవాక్కయ్యారు. హైదరాబాద్‌లో ఉంటూ హోటల్ ఫుడ్ ఇష్టపడేవారు ఇకనైనా మేల్కొకపోతే మీ ఆరోగ్యాన్ని మీ చేజేతులా నాశనం చేసుకున్నట్లే. ప్రముఖ హోటట్ బాహుబలి కిచెన్‌లో ఆహారం రుచిగా ఉండేందుకు సింథటిక్ ఫుడ్ కలర్స్‌ను ఉపయోగిస్తున్నారు. అలాగే వంటగదిలో ఆహార పదార్థాలపై బొద్దింకలు తిరగాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. మాదాపూర్ ప్రాంతంలో గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనీఖీలు నిర్వహించారు. రామేశ్వరం కేఫ్‌లో 16 వేలు విలువ చేసే గడువు ముగిసిన మినపపప్పు 100 కేజీలు, పెరుగు 10 కేజీలు, పాలు 8 లీటర్లు గుర్తించారు. బంజారాహిల్స్ బాస్కిన్ రాబిన్స్‌లో గడువు ముగిసిన వైట్ చాక్లెట్స్‌ను కనుగొన్నారు. లాబొనెల్ ఫైన్ బేకింగ్ ఇన్‌లో అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న వెనిగర్ గుర్తించారు. వాటిపై దిగుమతిదారుడి పేరు, లైసెన్సులు లేవు. ఫుడ్ హ్యాండ్లర్ మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల గడువు మార్చి 15న ముగిసినట్లు గుర్తించారు. కృతుంగా, మాస్టర్ చెఫ్, రెస్టో ఓ బార్, కామత్ హోటల్, జంబో కింగ్స్ బర్గర్ హోటల్లో సైతం కల్తీ, నిల్వ ఉంచిన ఆహారం వినియోగదారులకు అంటగడుతున్నారు. క్రీమ్ స్టోన్, నాచురల్ ఐస్ క్రీమ్, కరాచీ బేకరీ, కెఎఫ్‌సీ, రోస్టరే కేఫ్, హౌస్ రాయలసీమ, రుచుల్ షా, గౌస్ కామత్ హోటల్, 36 డౌనింగ్ బ్రూ పబ్, మకావ్ కిచెన్ అండ్ బార్, ఎయిర్ లైవ్, టాకోబెల్, ఆహా దక్షిణ్, సిజ్జల్ జో, ఖాన్‌సాబ్, హోటల్ సుఖ్‌సాగర్ వెజ్ రెస్టారెంట్, జుంబో కింగ్ బర్గర్స్, రతన్‌దీప్ రిటైల్ స్టోర్ నాసిరకం ఆహారం విక్రయిస్తున్నాయి. హైదరాబాద్ వ్యాప్తంగా అధికారులు నిర్వహిస్తున్న తనిఖీల్లో ప్రతి హోటల్, రెస్టారెంట్‌లో ఆహార కల్తీ జరుగుతోంది. ఇదే కొనసాగితే వాటిని తినేవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుంది. హానికరమైన రంగులు, రసాయనాలు మనిషికి ప్రాణాంతక కేన్సర్ రావడానికి కారణమవుతాయి. జీర్ణాశయం దెబ్బతిని అల్సర్ వచ్చే ప్రమాదం ఉంది. గుండె, మూత్రపిండాలు, కాలేయం పాడై పనిచేయడం మానేస్తాయి. ఫలితంగా ప్రాణాలకే ముప్పు ఏర్పడొచ్చు. కడుపునొప్పి, కీళ్ల నొప్పులు, విరేచనాలు కలిగి మెదడు పనితీరుపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఆహారం రుచిగా ఉండేందుకు ఉపయోగించే రసాయనిక పదార్థాలు మెదడు, ఎముకలపై ప్రభావం చూపుతాయి. అలాగే కల్తీ ఆహారంతో చర్మంపై దద్దులు, మచ్చలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

# హిట్లర్ క్యాబినెట్ లో గోబెల్..మోడీ కాబినెట్ లో కిషనరెడ్డి



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : హిట్లర్ క్యాబినెట్ లో గోబెల్ ఉన్నట్లే మోడీ కాబినెట్ లో కిషనరెడ్డి వ్యవహరిస్తున్నాడని టిపీసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి విమర్శించారు. శుక్రవారం గాంధి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ మోడీ చెప్పే అబద్ధాలను కిషన్ రెడ్డి మాట్లాడుతు సోది చెప్పే పాత్రను పోషిస్తున్నాడని ఏద్దేవ చేసారు.ఆగస్టు 15 లోపే రైతు రుణమాఫీ 2 లక్షలు చేస్తానని సీఎం రేవంత్ చెప్పరు.అందుకు కట్టుబడి లో ఉన్నామని స్పష్టం చేసారు.రైతు రుణమాఫీ 2 లక్షలు చేస్తారని రైతులకు నమ్మకం ఉంది..బిజెపి నాయకులకు కూడా ఉంది.అందుకే రుణ మాఫీ చెయ్యరు అని అబద్ధాలను ప్రకాచారం చేస్తున్నారు.ఆరు గ్యారెంటీ లు అమలు అవుతున్న సంగతి బిజెపి కి తెలియదా..? ఎన్నికల కోడ్ ఉన్న విషయం ప్రజలకు తెలుసు. బిజెపి నాయకులు సోది చెప్పుతున్నారని దుయ్యబట్టారు.కిషన్ రెడ్డి స్థాయి సోది చెప్పే స్థాయి కి వెళ్లారు.తెలంగాణా లో రాజకీయ పు:నరేకీకరణ జరుగుతుంది ఢిల్లీలో లో కాంగ్రెస్ అప్ కలిసి ప్రభుతం ఏర్పడబోతుందని రవి జోశ్యం చెప్పారు.ఇంకోసారి రేవంత్ రెడ్డి పై ఆరోపణలు చేస్తే బిజెపి కార్యాలయాన్ని ముట్టడిస్త మని హెచ్చరించారు. తెలంగాణ ఇచ్చినా తల్లి సోనియా గాంధీ కి సన్మానం చేస్తాం.సోనియా గాంధీ రాకను అడ్డుకుంటే ప్రజలు తిరగబడతారు. కిషన్ రెడ్డి జాగర్త దేశం వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగుతుంది. భారత దేశం లోరాహూల్ గాంధీ ప్రధాని చెయ్యాలని ప్రజలు డిసైడ్ అయ్యారు కెసిఅర్ కు 2023 డిసెంబర్ లో ప్రజలు సన్మానం చేశారు.మళ్లీ ఆయనకు సన్మానం చెయ్యడమా?అని అన్నారు.ఈ సమావేశం లో మహిళా నాయకురాలు ఇందిరా శోబన్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ ని అరెస్ట్ చేయండి



మొదటి పేజీ తరువాయి

ఆయనో ఫేక్‌న్యూస్ పెడ్లర్ అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

కేటీఆర్ ఏమని పోస్ట్ చేశారంటే..?

రూ.10 వేల కోట్ల కొవిడ్ డ్రగ్ కాంట్రాక్ట్ వచ్చిందని ఆరోపించారు

సచివాలయంలో నిజాం ఆభరణాలు తప్పినట్లు నకిలీ కథనాలు పుట్టించారు

కేంద్రహోంమంత్రి అమిత్‌షా కు సంబంధించిన ఫేక్ వీడియోను సర్క్యులేట్ చేశారు

ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించిన ఫేక్ సర్క్యులర్ పోస్ట్ చేశారు

సీఎం హోదాలో ఉండి తప్పుడు ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్న రేవంత్‌ని జైలులో ఎందుకు పెట్టకూడదు.. అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కాగా.. గత కొన్ని రోజుల నుంచి కాంగ్రెస్.. బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, వరికి బోనస్ తదితర అంశాలే టార్గెట్ గా బీఆర్ఎస్ కాంగ్రెస్ ను విమర్శిస్తోంది.. అదే స్పీడులో కాంగ్రెస్ పార్టీ సైతం తెలంగాణ అభివృద్ధి గురించి కౌంటర్ ఇస్తూ గులాబీ పార్టీపై విరుచుకుపడుతోంది.. ఈ క్రమంలోనే కేటీఆర్ సోషల్ మీడియాలో పలు వ్యాఖ్యలు చేయడం సంచలనంగా మారింది.

# నడి రోడ్డుపై మద్యం మత్తులో యువతి హల్చల్

రంగారెడ్డి, ప్రభాత సూర్యుడు : ఫతుల్లగూడ నడిరోడ్డుపై ఉదయం 6గంటల సమయంలో యువతీ యువకుడు మద్యం సేవిస్తూ విచ్చలవిడిగా చెలరేగిపోయారు. అటుగా వాకింగ్ కు వెళ్లిన వారు ఇక్కడ తాగవద్దని చెప్పడంతో వారిని దుర్భషాలాడుతూ నాఇష్టం వచ్చినట్టు తాగుత మీరెవరు చేప్పడానికి అంటూ బీరు బాటిళ్లు పగలకొడుతూ హంగామా చేసింది చివరికి వాకింగ్ కు వచ్చినవారు సర్దిచెప్పడంతో అక్కడినుండి వెళ్లారు

# రాకేష్ రెడ్డిని గెలిపించాలి



సూర్యాపేట, ప్రభాత సూర్యుడు : సూర్యాపేట జిల్లా కోర్టుల ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు మాజీ మంత్రి సూర్యపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అభ్యర్ధించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన గొంతు ప్రశంసించే గొంతుగా మారింది. 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నిక మేధావులు విద్యావంతులు పట్టబద్రులు ఆలోచించి టిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి గత ప్రభుత్వ పథకాలను కూడా కొనసాగించడం లేదు. తొమ్మిదేళ్ల పాలనలో ప్రతి ఒక్క రోజు ప్రతి ఒక్కరిని ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ది . రాష్ట్రంలో ఐదు నెలల్లో అధికారంలో ఉండే విద్యుత్ నిర్వహణను ఆగం చేశారు. ఆసుపత్రుల్లో సెల్ ఫోన్ లైట్ వేసుకొని ఆపరేషన్లు చేసే దుస్థితికి తీసుకువచ్చారు. డూప్లికేట్ మందులు మార్కెట్లోకి వస్తున్న ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. రాష్ట్రంలో 1000 గురుకులాలను ఏర్పాటు చేసి ఆదర్శవంతంగా నిర్వహించి అద్భుతమైన మెనూ 10 లక్షల రూపాయలు తీసుకొనే కళాశాలలో కూడా అమలు చేయని మేనును ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేశాడని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విశ్వా ఆహారం అందిస్తూ వందలాదిమంది విద్యార్థులు అస్వస్థతకు గురై తిన్న పట్టించుకోవడం లేదు. నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని దాటవేస్తున్నారు... రైతు పండించిన పంటకు బోనస్ కూడా ఇవ్వడం లేదు. టిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మంచి వాక్చాతుర్యం ప్రశ్నించే తత్వం పోరాట పట్టిమ ఉన్న వ్యక్తి . కాంగ్రెస్ అభ్యర్థిని ఆయన అనుచరులే తిట్టిపోసుకుంటున్నారని ఆయనపై 56 కేసులు నమోదు అయితే టిఆర్ఎస్ ప్రభుత్వం పెట్టింది ఒకటి లేదు. బిజెపి అభ్యర్థి 32 గా పోటీ చేస్తున్నాడని పోలింగ్ రోజు కనపడి తర్వాత కనిపించకుండా పోతాడు ఆయన మాట్లాడినట్టు నేనెప్పుడూ చూడలేదు ఆయన పట్ట బద్రుల పక్షాన ఎలా ప్రశ్నిస్తాడు. ఓటు వేస్తున్నామంటే మన గొంతును అభ్యర్థికి ఇస్తున్నట్లేనని ప్రశ్నించే గొంతు ప్రశంసించే గొంతు గా మారిందని అందుకే ప్రశ్నించే గొంతుక ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## ఎడిటోరియల్ EDITORIAL

# సామాన్యుడికి ఎన్నికల కష్టాలు

దేశంలో ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన నిబంధనలనే మనం ఎన్నికల నియమావళి అంటున్నాం. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన మొదలు కౌంటింగ్ ముందు వరకు ఈ నియమావళి అమల్లో ఉంటుంది. కోడ్ అమల్లో ఉన్న సందర్భంలో రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో జరిగే పనులను ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తుంది. ఈ సమయంలో ప్రభుత్వాలకు కేవలం నామ మాత్రపు అధికారాలే ఉంటాయి. ఎన్నికల నిర్వహణ సాఫీగా, పారదర్శకంగా జరిగేందుకు తగిన ఏర్పాట్లు జరగాల్సిందే గానీ, ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా సుదీర్ఘకాలం పాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం వల్ల అటు ప్రభుత్వాలకు, ఇటు సామాన్య లకు ఇబ్బంది ఎదురవుతోంది.ఎన్నికల నియమావళి ప్రకారం మద్యం, నగదు పంపిణీ, ఆస్తుల విధ్వంసం, ఫేక్ న్యూస్ ప్రచారం చేయటం, ఓటర్లను భయపెట్టటం, రెచ్చగొట్టే ప్రసంగాలు, అనుచిత వ్యాఖ్యలు , నేతల అన్ పార్లమెంటరీ భాష, కులం, మతం ప్రాతిపదికన ఓట్లు అడగడం, ఆయుధాల ప్రదర్శన, భయపెట్టడం, నిరాధార ఆరోపణలు చేయడం, అధికార పార్టీలో ఉన్నవారు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయటం కుదరదు. అయితే, ఈ నిషేధాలు వాస్తవంగా అమలవుతున్నాయా? అంటే లేదనే జవాబే వస్తోంది. సాక్షాత్తూ దేశ ప్రధాని మతం పేరుతో ఓటర్ల మధ్య చీలిక తెచ్చే ప్రయత్నం చేసినా, ఎన్నికల సంఘం మందలిస్తూ, నోటీసులకే పరిమితం అయింది.ప్రస్తుతం మన దేశంలో ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాలుగో దశలో మే 13వ తేదీన తెలంగాణలో ఎన్నికలు పూర్తయ్యాయి. అంటే.. ఎన్నికలు జరిగి పదిరోజులు పూర్తి కాగా, మరో 10 రోజుల పాటు ఎన్నికల కోడ్ ఇక్కడ అమలులో ఉండనుంది. ఇదే సమయంలో ఖరీఫ్ సీజన్ మొదలు కానుంది. తెలంగాణలో కురిసిన అకాల వర్షాలతో రైతన్నలకు అపారం నష్టం జరిగింది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం నీటి పాలైంది. మరోవైపు నగరాల్లో వర్షాకాలంలో వచ్చే సమస్యలను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాగం క్షేత్ర స్థాయిలో అనేక పెండింగ్ పనులు చేయాల్సి ఉంది. ఇక.. మరో రెండు వారాల్లో వేసవి సెలవుల అనంత రం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పాఠశాలలన్నీ తెరుచుకోనున్నాయి. కోడ్ కారణంగా టీచర్లు, విద్యార్థులకు సంబంధించిన ఏ రకమైన నిర్ణయాలూ తీసుకునే అవకాశం లేకుండా పోయింది. ఒకవేళ, ఇక్కడి ముఖ్యమంత్రి పై అంశాల మీద ఏదైనా నిర్ణయాలు తీసుకుంటే, దానివల్ల ఆంధ్ర ప్రదేశ్, తదితర పొరుగు రాష్ట్రాల ఓటింగ్ సరళిని ప్రభావితం చేస్తాయని ప్రశ్న తలెత్తినా.. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో ఐదో విడతలోనే ఎన్నికలు పూర్తయి పోయాయి కనుక ఆ ప్రశ్న కూడా ఉత్పన్నం అయ్యే అవకాశమే లేదుమరోవైపు, నియమావళిలో భాగంగా ఎన్నికల వేళ ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లోని సిబ్బంది తనిఖీల పేరుతో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు ఫీజు రూపంలో చెల్లించేందుకు రూ.50 వేలకు మించి నగదు తీసుకుపోతున్న వారికి ఈ తనిఖీలు తలనొప్పిగా మారుతున్నాయి. బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసినట్లుగా రసీదు వంటివి లేదని నగదును, ఏదైనా శు భకార్యాలకి బయలుదేరిన వారి వద్ద నగలను సీజ్ చేయటం జరగుతోంది. ఈ నగదును, బంగారాన్ని సీజ్ చేసి కోర్టుకు స్వాధీన పరచటంతో తిరిగి, వాటిని ఆధారాలు చూపి తీసుకోవాలసి రావటం సామాన్యులకు ఇబ్బందిగా మారింది.అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే, కొత్త ప్రభుత్వం ఇల్లు సర్దుకో కముందే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావటం, ఈ రెండు నెలల పాటు ఎన్నికల కోసం సమయం కేటాయించాల్సి రావటంతో నూతన ప్రభుత్వం తలపెట్టిన అనేక పనులు పెండింగ్‌లో పడిపోయాయి. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎన్నికల కోడ్ కారణంగా నేటికీ ప్రభుత్వం అమలుచేయలేని పరిస్థితి. ఒకవైపు ఖరీఫ్ సీజన్ రావటంతో వీలున్నంత త్వరగా రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నా.. ముంద డుగు వేయలేని దుస్థితి. మరో వైపు, రైతులకు కొత్తగా రుణాలు అందించేందుకు బ్యాంకర్లతో ప్రభుత్వం చర్చిం చాల్సి ఉంది. ఇన్నిపనులు పెండింగ్‌లో ఉన్నా, ప్రభుత్వం నేరుగా ఏ నిర్ణయమూ చేయలేని పరిస్థితి. చివరికి తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా మంత్రి మండలి సమావేశం నిర్వహిం చుకోవటానికీ ఈ నియమావళి అడ్డంకిగా మారింది. దీంతో ప్రభు త్వం సమీక్షా సమావేశాలు నిర్వహించాల్సి వస్తోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల విధినిర్వ హణకు అడ్డంకిగా మారిన నియమావళి మీద పున:సమీక్ష చేయాలని, అదే సమయంలో కోడ్ కారణంగా ఆయా విభాగాల పనులు పెండింగ్‌లో పెట్టి ప్రజలను ఇబ్బందులు పాలు చేయకుండా, సదరు విభాగాధిపతులు తమకున్న పరిమితుల మేరకు పాలనా సంబంధిత అంశాల అమలును తమ బాధ్యతను స్వీకరించాలని మేధావులు కోరుతున్నారు.

# నేటి నుండి రోహిణి కార్తే ప్రారంభం

ప్రభాత సూర్యుడు, డెస్క్ : రోహిణి కార్తే వచ్చింది అంటే వామ్మో రోహిణి కార్తెలో ఎండలకు రోల్లు పగిలే ఎండలు ఉంటాయి అనే నానుడి మనలో మెదలాడుతూ ఉంటుంది. నిజమే మరి ఈ నాలుగు నెలల ఎండాకాలంలో ఎండలు తోలి రోజులలో కొద్ది కొద్దికగా ఉగాది నుండి తాపం పెరుగుతుంది. దిన దిన ప్రవర్ధనమానంగా సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని మనకు చూపిస్తాడు. రోహిణి కార్తే సూర్యుడు రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించడాన్ని సూచిస్తుంది మరియు సాంప్రదాయకంగా సంవత్సరంలో అత్యంత వేడిగా ఉండే పక్షం రోజులుగా పరిగణించబడుతుంది. రోహిణి కార్తీ సాధారణంగా మే 3వ లేదా చివరి వారంలో ప్రారంభమవుతుంది మరియు కాన్పుల రోజులు దాదాపు 15 రోజుల పాటు కొనసాగుతాయి. మాములుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు దద్దరిల్లుతాయి. మరి ఈ సంవత్సరం రోహిణి కార్తె ఏలా ఉంటుందో గమనిద్దాం. తేదీ. ఈ సంవత్సరం రోహిణి కార్తే మే 25 న ప్రారంభమై జూన్ 8 వరకు రోహిణి కార్తె ఉంటుంది. మాములుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు దద్దరిల్లుతాయి. అన్ని కార్తెల కన్నా రోహిణి కార్తె అంటే బంబేలెత్తిపోతారు. ఈ కార్తెలో ఎండలు మండిపోతాయని చెప్పడానికి బదులు రోహిణి కార్తెలో ఎండలకు రోళ్ల పగులుతాయంటారు. అంటే వేడి తీవ్రత ఏ రేంజ్ లో ఉంటుందో అని చెప్పడమే దీని ఉద్దేశం..రోహిణి కార్తె ఫలితంగా ఈ పక్షం రోజులు అధిక వేడి గాలులు , ఎండ తీవ్రతలు , అగ్ని ప్రమాదాలు , ఉక్కపోతలు ఉంటాయి. ఎండ తీవ్రతకు శరీరం అలసిపోతుంది. కావునా ఆరోగ్య రీత్య తగు శ్రద్దలు తీసుకోవాలి. ఎక్కువ మట్టికుండ నీళ్ళు త్రాగడం , మజ్జిగా , పండ్ల రసాలు , కొబ్బరినీళ్ళు , నిమ్మరసం , రాగి జావ , ఫలుదా లాంటివి ఎక్కువగా త్రాగడం వలన ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుంది కొంత ఉపశమనం లభిస్తుంది. మసాలాకు సంబంధించిన ఆహార పదార్థాలు , వేపుళ్ళు , పచ్చళ్ళు , ఎక్కువ ఆయిల్ ఫుడ్ కలిగిన ఆహార పదార్థాలు తినకూడదు. నీళ్ళ సౌకర్యం ఉన్నవారు తప్పకుండా రెండు పూటల స్నానం చేయండి. అన్నిరకాల వయస్సు వారు ఎక్కువ కాటన్ దుస్తులు వాడండి , తెల్లని రంగు కల్గినవి , తేలిక రంగులు గల కాటన్ బట్టలు ధరిస్తే ఉష్ణ తాపం నుండి ఉపశమనం లభిస్తుంది. శారీరక తాపం తగ్గుతుంది. చిన్నపిల్లలకు మీరు ఉండే ఇంటి ఉష్ణోగ్రత తీవ్రతను బట్టి తడి గుడ్డతో తుడిచి బట్టలు మార్చండి. ఎవరైనా సరే ముదురు రంగు దుస్తులు వేయకపోవడం ఉత్తమం. ముఖ్యంగా సాటి జీవులైన పశు , పక్ష్యాదులకు త్రాగడానికి మీరు నివసించే చోట వాటికి నీళ్ళను ఏర్పాటు చేయండి. బాటసారులు ఎవరైనా సరే వాళ్ళు అడగక పోయిన వాళ్ళ దాహాన్ని తీర్చేందుకు వారికి త్రాగడానికి చల్లటి నీళ్ళను అందివ్వండి. ఇలాంటి సంఘ సేవా కార్యక్రమాలు చేయడం వలన మీకున్న గ్రహభాదలు నివారణకు మార్గమై కొంత ఉపశమనం లభిస్తుంది.

# రేవంత్ వి బోగస్ మాటలు

నల్గొండ, ప్రభాత సూర్యుడు : వరంగల్-నల్గొండ-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నకిరేకల్ లో జరిగిన పార్టీ సన్నాహక సమావేశంలో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగించారు. కేటీఆర్ మాట్లాడుతూ జీవో నంబర్ 46 గురించి ప్రధానంగా మాట్లాడాలె. ఆ జీవో ను మేము అధికారంలో ఉన్నప్పుడే రద్దు చేసేందుకు ప్రయత్నించాం. కానీ ఎన్నికల కోడ్ కారణంగా చేయలేకపోయాం. ఎవరికీ అన్యాయం చేసే ఆలోచన మాకు లేదు. పదేళ్లలో దాదాపు 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్ గారి. అలాంటిది నిరుద్యోగులకు అన్యాయం చేస్తారా? జీవో నంబర్ 46 లో సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేసే విధంగా మా శాసన సభ్యులందరం ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తాం. కాంగ్రెస్ వస్తే మోసపోతామని ముందే చెప్పాం. కానీ వాళ్లిచ్చిన హామీలతో వాళ్లను ప్రజలు నమ్మారు. ఆరు నెలల్లో ఏం జరిగింది. ఏం జరుగుతోందన్నది మనం ఒక్కసారి ఆలోచించాలె. రేవంత్ రెడ్డి వచ్చాకా ప్రభుత్వం లో ఎవరి దుకాణం వాళ్లదే అన్నట్లు తయారైంది. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి లాంటి వాళ్లది ఎవరిది వారిదే దుకాణం. ఎవరి ట్యాక్స్ వాళ్లదేనని అన్నారు.

డిసెంబర్ 9 నాడే రూ. 2 లక్షలు రుణమాఫీ ఫైల్ మీద మొదటి సంతకం పెడతా అని రేవంత్ రెడ్డి అన్నాడు. రుణమాఫీ చేస్తా అని చెప్పి ఆరు నెలలు కావస్తోంది. రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకున్నాడా? మాట తప్పాడా? ఒక్కసారి ఆలోచించండి. రైతు భరోసా పేరుతో రూ. 15 వేలు అన్నాడు. కౌలు రైతులు, రైతు కూలీలకు కూడా ఆర్థిక సాయం చేస్తా అన్నాడు. అన్నింటికి మించి రూ. 500 క్వింటాల్ వడ్లకు బోనస్ ఇస్తా అన్నాడు. రూ. 21 వందల 83 రూపాయల వడ్లకు బోనస్ ఇస్తా అన్నాడు. 21 వంద 83 రూపాయలు దొడ్డు వడ్లదే కదా? మరి కాంగ్రెసోళ్లు దొడ్డు వడ్లకు బోనస్ ఇయ్యరంట. సన్న వడ్లకు మాత్రమే బోనస్ అని కేబినెట్ మీటింగ్ తర్వాత చెప్పారు. ఇప్పుడు సన్న వడ్లకు బోనస్ అంటే ఈ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పినవన్నీ బోగస్ మాటలే కదా? రైతులను ఇంత దగా చేసిన ఈ ప్రభుత్వానికి మనం బుద్ధి చెప్పాలా? వద్దా? వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అని టైమ్ తో సహా చెప్పింది రేవంత్ రెడ్డే. ఎవరు అడగకుండా ఫోజుల కోసం వంద రోజులు అన్నాడు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే వాళ్ల ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదు. కానీ రైతులను దగా, మోసం చేసినందుకు కాంగ్రెసోళ్లకు కచ్చితంగా బుద్ధి చెప్పాలె. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ ఎట్ల ఉండే...ఇప్పుడు ఎలా ఉంది? కాంగ్రెసోళ్లు ఇంకేదో చేస్తారని ఆశ పడితే ఉన్నదే పోయిన పరిస్థితి వచ్చిందని అన్నారు.




కేసీఆర్ నాట్లు వేసేప్పుడు రైతుబంధు ఇచ్చారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఓట్లు వేసే నాడు రైతుబంధు ఇస్తున్నాడు.

ఎన్ని అబద్దాలు చెప్పిన సరే ప్రజలకు మాకే ఓటు వేస్తారనే ధీమాతోనే ఇష్టమొచ్చినట్లు అబద్దాలు చెబుతున్నాడు. మహిళలకు రూ. 2500, పెద్దమనుషులకు ఇంట్లో ఇద్దరికీ రూ. 4 వేలు, తులం బంగారం, స్కూటీలు అన్నారు. ఒక్క మహిళలకు రూ. 2500 వచ్చాయా? కానీ అందరికీ డబ్బులు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు తెలంగాణలో మహిళలకు రూ. 2500 ఇస్తున్నామంటూ సిగ్గులేకుండా అబద్దాలు చెబుతున్నారు. ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేసిన అని రేవంత్ రెడ్డి కూడా సిగ్గులేకుండా అబద్దాలు చెబుతున్నాడు. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప వేరే ఏదీ చేయలేదు. కానీ ఇక ఒక్కటే హామీ మిగిలిందంటున్నాడు. ఇక మన గుండు కొట్టుడు ఒక్కటే మిగిలినట్లు ఉంది. వాళ్లిచ్చిన ఆరు గ్యారంటీల్లో 13 హామీలున్నాయి. 407 ఇతర హామీలు కూడా ఉన్నాయి. ఏ మనిషిని ఐతే నమ్మారో ఆ మనిషే దేవుడిని మీద ఒట్లు పెడతారు. రేవంత్ రెడ్డి మీద ప్రజలకు నమ్మకం లేదని తెలిసే ఆయన దేవుడి మీద ఒట్లు వేస్తున్నాడు. ఈ ముఖ్యమంత్రి, కాంగ్రెసోళ్లు పెద్ద లంగలు. అన్ని అబద్దాలే చెబుతున్నారు. ??రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఎన్ని నోటిఫికేషన్లు వచ్చినయ్? గాడిద గుడ్డు మాదిరిగా ఒక్క నోటిఫికేషన్ కూడా ఇయ్యలే. కానీ 30 వేల ఉద్యోగాలు ఇచ్చినా అంటున్నాడు. ఒక్క ఎగ్జామ్ పెట్టకుండా ఎక్కడి నుంచి ఇచ్చిండో చెప్పడు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలు నువ్వు ఇచ్చినా అని చెప్పుకుంటే గ్రాడ్యుయేట్లు నమ్ముతారా? ఏడాది లో 2 లక్షల ఉద్యోగాలు అన్నారు. మరి ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ లేదని అన్నారు.

అయినా సరే కాంగ్రెసోళ్లను గెలిపిస్తే వాళ్లు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారా? పదవులకు కోసం పైరవీలే చేసుకుంటారు. 2 లక్షల ఉద్యోగాలు ఏవీ అంటే అడగటానికి బీఆర్ఎస్ ఉండాలె. మెగా డీఎస్సీ అన్నాడు. 50 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ అన్నాడు. దాని గురించి మనం అడగొద్దా? కాంగ్రెస్ ఇప్పుడు ఓట్లు వేస్తే నేను ఏ హామీ అమలు చేయకపోయినా సరే నాకే ఓట్లు వేశారని రేవంత్ రెడ్డి భావిస్తాడు. ఎంట్రన్స్ టెస్ట్ ఎగ్జామ్స్ రూ. 500 ఉండే. అప్పుడు రేవంత్ రెడ్డి లొల్లి చేసిండు. కానీ ఇప్పుడు టెట్ ఫీజు ను రూ. 2 వేలు చేసిండు. అధికారంలోకి రాకముందు ఒక మాట...అధికారంలోకి వచ్చాక మరొక మాట. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి సామాన్య రైతుబిడ్డ. ఎంతో కష్టపడి బిట్స్ పిలానీలో సీటు తెచ్చుకొని గోల్డ్ మెడల్ సాధించాడు. అమెరికాలో 7 ఏళ్లు పెద్ద పెద్ద సంస్థలో ఉద్యోగం చేసిండు. ఆ తర్వాత ప్రజాసేవ కోసం తెలంగాణకు వచ్చిండు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి తెల్లారి లేస్తే యూట్యూబ్ లో బూతులు, ఇష్టమొచ్చినట్లు మాట్లాడుడే ఆయన పని. ఆయన మీద 56 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆడపిల్లల ఫోటోలు మార్ఫింగ్ చేసినందుకు కొన్ని కేసులున్నాయి. బ్లాక్ మెయిల్ చేసి ఒక కుటుంబాన్ని ఆత్మహత్య చేసుకునేలా చేసినందుకు ఒక కేసు. అన్ని ఇలాంటివే ఆయనపై ఉన్న కేసులు. 56 క్రిమినల్ కేసులు...74 రోజులు చంచల్ గూడ జైల్లో ఉన్న అనుభవం ఆయనది. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు పోలే. లంగ పనులు చేసి ఆయన జైలుకు పోయిండు. తెల్లారి లేస్తే బూతులు మాట్లాడే వ్యక్తిని గెలిపిస్తే పెద్దల సభ కూడా బూతుల సభగా మారుతుంది. రాకేష్ రెడ్డి గెలిస్తే ఏమైంది నువ్వు ఇస్తా అన్న... ఉద్యోగాలు అంటూ గల్లా పట్టి నిలదీస్తాడు. ఈ ప్రభుత్వం పనితీరు ఎలా ఉందో మనకు ఈ ఆరు నెలల్లోనే అర్థమైంది. ఇదే తీన్మార్ మల్లన్న, కోమటి వెంకట్ రెడ్డి రైతుబంధు పడలేదంటే చెప్పుతీసి కొడతా అన్నారు. అలాంటి వ్యక్తిని గెలిపించి వాళ్లతో మనం దెబ్బలు తిందామా? ఈ సమయంలో ప్రభుత్వానికి బాకా ఉదేటోళ్లు కాదు. ప్రభుత్వం బాజా భజాయించే వాళ్లు కావాలె. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పెద్ద మనుషులు ఇలా ఏ వర్గం కూడా సంతృప్తిగా లేదని తెలియాలంటే కాంగ్రెస్ ను ఓడించాలె. రాకేష్ రెడ్డి ని గెలిపించేందుకు బ్యాలెట్ లో 3 వ నంబర్ లో వన్ అనే నిలువు గీత ఒక్కటే గీయండని అన్నరు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR(V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215